క్లుప్తంగా

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ



సత్తెనపల్లి: పబ్లిక్ పరీక్షల్లో పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జెడ్.ఎస్. రామచంద్రరావు అన్నారు. పట్టణంలోని సుగాలి కాలనీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రిన్సిపల్, ఉపాధ్యాయ బృందం శుక్రవారం పరీక్షకు అవసరమైన రైటింగ్ ప్యాడ్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులు సైతం పట్టుదలతో విద్యనభ్యశించి ఉత్తీర్ణులు కావాలన్నారు. పాఠశాల హెచ్‌ఎం లతా ప్రియదర్శిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా బాలదాసు ఆరాధనోత్సవం

కుందురువారిపాలెం(ముప్పాళ్ళ): కుందురువారిపాలెంలోని శ్రీశెట్టిపల్లి బాలదాసు సద్గురుదేవుల 89వ ఆరాధన మహోత్సవం శుక్రవారం జరిగింది. ఆలయంలో హరేరామ నామ సంకీర్తన, ఉదయం సూర్య పూజా కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పొంగళ్లు సమర్పించి, తమ మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం గురువు చిత్రపటం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు అన్నదాన చేశారు. మహిళల కోలాటం, భజన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఊటుకూరులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం



ఊటుకూరు(క్రోసూరు): మండలంలోని ఊటుకూరులో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ బీవీఎస్ రమాదేవి, డాక్టర్ టి.సుధీర్ కుమార్, డాక్టర్ ఎస్.సుమిత్ర రోగులకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందించారు. బీపీ షుగర్, సాధారణ రోగులు 309 మందికి వైద్య పరీక్షలు చేశారు. 29 మందికి కళ్లజోళ్లకు సిఫార్సు చేశారు. ఎంపీపీ పి.కోటయ్య, ఎంపీడీవో వెంకటరమణ శిబిరాన్ని సందర్శించారు. సర్పంచ్ బుచ్చయ్య, సీహెచ్‌వో సాంబశివరావు, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్, సూపర్‌వైజర్ శివుడు, గ్రామ కార్యదర్శిషేక్ ఖాజావలి, సచివాలయం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మహబూలాబీ తదితరులున్నారు.

నేడు గ్రామ వలంటీర్లకు అవార్డుల ప్రదానం

సత్తెనపల్లి: మండలంలోని గ్రామ వలంటీర్లకు శనివారం సాయంత్రం మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో అవార్డులు ప్రదానం జరుగుతుందని ఎంపీడీఓ ఎస్.జగదీష్ శుక్రవారం తెలిపారు. మండలంలో ఐదుగురికి సేవారత్న, 388 మందికి సేవా మిత్ర అవార్డులను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఎంపీపీ యలవర్తిపాటి షేక్ జైభూన్ బీ, జెడ్పీటీసీ సంకటి నాగేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

అచ్చంపేట సీఐగా కరిముల్లా షా వలి



అచ్చంపేట: స్థానిక పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కరిముల్లాషా వలి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డిని ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు.

ముస్లింల పురోగతిపై రేపు బహిరంగ సభ

పిడుగురాళ్ల: ముస్లింల పురోగతిపై ఈ నెల 18న పట్టణ జానపాడురోడ్డులోని ఏడు కొట్ల సెంటర్లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు అంజుమన్ కమిటీ కార్యదర్శి షేక్ మస్తాన్ వలి శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పీస్ మెసేజ్ ఫౌండేషన్ ఫౌండర్ బ్రదర్ సిరాజ్ హాజరై ప్రసంగించనున్నారు. ముస్లింల పురోగతి ఎప్పుడు.. ఎలా.. అనే అంశంపై సిరాజ్ ఈ బహిరంగ సభలో ప్రసంగించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటలకు సభ ప్రారంభం అవుతుంది. కావున గురజాల నియోజకవర్గంలోని ప్రజలందరు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఇటొస్తే.. కనిపిస్తాయి ప్రగతి బాటలు

- పెదకూరపాడు మండలంలో రోడ్ల అభివృద్ధి
- మండల కేంద్రానికి వచ్చేందుకు మార్గాలు సుగమం
- రూ.60 లక్షల ఏఎంసీ నిధులతో పాటిబండ్ల - పాములపాడు తారురోడ్డు
- ప్రతిపక్ష నాయకుడు దత్తత గ్రామం కన్నెగండ్లకు రూ.60లక్షతో రోడ్డు
- తీరిన కాశిపాడు వాసుల కల..
- పెదకూరపాడు–భీమినేనివారిపాలెం, ఆత్తలూరుకు ఆర్అండ్‌బీ రోడ్లు
- ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- కాగితాల విమర్శలకు.. క్షేత్రస్థాయి సమాధానాలు

దశాబ్దాలుగా ప్రయాణికులు పడుతున్న కష్టాలకు పరిష్కార 'మార్గం' లభించింది. అనేక గ్రామాల ప్రజల ప్రయాణ బాధలు తీరుతున్నాయి. పెదకూరపాడు ప్రగతి 'బాట'లు వేగంగా విస్తరిస్తున్నాయి. ఓ పక్క ప్రజా సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యంగా ముందుకుపోతున్న రాష్ట్ర ప్రభుత్వం.. అభివృద్ధి కూడా అదే దారిలో అంతే వేగంగా చేసుకుంటూ పోతోంది. దీనికితోడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు సమస్యల పరిష్కారంలో ఉన్న దార్శనికత నియోజకవర్గ ప్రజల కష్టాలు తీరుస్తోంది. రోడ్ల విషయంలో ప్రతిపక్షాలది అనవసర రాద్ధాంతామే గాని, వాస్తవ వాదన లేదన్నది..ఈ సాక్ష్యాలను చూస్తే స్పష్టంగా అర్థమవుతుంది.

– పెదకూరపాడు



పెదకూరపాడు-భీమినేనివారి పాలెం రోడ్డు

పాటిబండ్ల రహదారి నిర్మాణంతో కష్టాలు తీరాయి



పాటిబండ్ల - పెదకూరపాడు రహదారి తారురోడ్డు

పెదకూరపాడు- పాటిబండ్ల రోడ్డు నిత్యం ఏప్పుడూ రద్దీగా ఉండేది. రెండు దశాబ్దాల క్రితం నుంచి రహదారి పూర్తిగా అధ్వానంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ రహదారిని గత టీడీపీ పాలకులు పట్టించుకోలేదు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, పాటిబండ్ల, జలాల్‌పురం, బుస్సాపురం గ్రామాల మండల కేంద్రమైన పెదకూరపాడు వచ్చే గ్రామస్తులు ఈ అధ్వాన రోడ్డులో ప్రమాదాలకు గురయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఏఎంసీ నిధులు రూ.60 లక్షలు తీసుకొచ్చి.. 2.7 కిలో మీటర్లు తారు రోడ్డు వేయించారు.

కాశిపాడు కష్టాలు తీర్చారు

సరైన రహదారి లేక కాశిపాడు గ్రామానికి బస్సులు కూడా వెళ్లలేని పరిస్థితి. దశాబ్ది కాలంగా రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ఆటోలు కూడా ఊర్లోకి రాలేని దుస్థితి. దీంతో కాశిపాడు గ్రామ ప్రజలు అమరావతి–సత్తెనపల్లి కాలచక్ర అడ్డరోడ్డుకు వచ్చి మండల కేంద్రానికి, ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక మూడు కిలోమీటర్లకుపైగా రూ.46 లక్షలతో తారు రోడ్డు నిర్మించారు. గ్రామ ప్రజల ప్రయాణ కష్టాలు తీరాయి.



కాశిపాడు తారు రోడ్డు

ప్రతిపక్ష నాయకుడి దత్తత గ్రామానికి రోడ్డు



కన్నెగండ్ల-లగడపాడు రోడ్డు

మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ మండలంలోని కన్నెగండ్ల గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. కానీ అభివృద్ధి మాత్రం చేయలేదు. ఆ గ్రామ ప్రజలు పక్కన ఉన్న లగడపాడు గ్రామానికి కాలి నడకన వచ్చి ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు 4 కిలోమీటర్ల మేరకు రూ.60లక్షల వ్యయంతో తారు రోడ్డు నిర్మించారు. కన్నెగండ్ల గ్రామ ప్రజల కష్టాలు తీర్చారు. ఆర్ అండ్ బీ రోడ్లు పెదకూరపాడు- భీమినేనివారి పాలెం రోడ్డును రూ.26లక్షలతో, పెదకూరపాడు-రామాపురం రూ.30లక్షలతో రోడ్డు మరమ్మతులు చేశారు. పెదకూరపాడు మండలంలో అన్ని రహదారులు బాగుచేశారు.

అభివృద్ధి చేసి చూపించాం



పెదకూరపాడు మండలంలో ఏళ్ల తరబడి మరమ్మతులకు, నిర్మాణాలకు నోచుకోని రోడ్లను అభివృద్ధి చేశాం. పాటిబండ్ల, కన్నెగండ్ల, కాశిపాడు, పెదకూరపాడు గుంటూరు రోడ్డు, పెదకూరపాడు ఆత్తలూరు రోడ్డు ఇలా అన్ని రోడ్లు వేశాం. అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపించాం, వాటిని చూపి ఆశీర్వదించమని ప్రజలను కోరుతున్నాం. ఇదీ మా నిబద్ధత.

– నంబూరు శంకరరావు, ఎమ్మెల్యే, పెదకూరపాడు.

కన్నెగండ్ల కష్టాలు తీర్చారు



మా గ్రామానికి వచ్చే రహదారి పూర్తిగా ఆధ్వానంగా ఉండేది. విద్యార్థులు, ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు రోజు లగడపాడు గ్రామానికి రెండు కిలో మీటర్లు నడిచి వెళ్లేవారు. ఆటోలు కూడా వచ్చేవి కావు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక.. మా గ్రామానికి రోడ్డు వేశారు. ప్రయాణ కష్టాలు తీరాయి.

–పెద్దింటి బాపయ్య, గ్రామస్తుడు, కన్నెగండ్ల.

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగల ధర్నా



ధర్నా చేస్తున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

సత్తెనపల్లి: ప్రైవేట్ ఆపరేటర్స్‌కి 5జీ ఇచ్చిన ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్ 4జీ ఇప్పటి వరకు ఇవ్వలేదని, బీఎస్ఎన్ఎల్ లో–పే రివిజన్, పెన్షన్ రివిజన్ కాలపరిమితి తీరి ఏడు సంవత్సరాలైనా ఇప్పటికీ పే రివిజన్, పెన్షన్ రివిజన్ చేయలేదని సత్తెనపల్లి బ్రాంచ్ కార్యదర్శి షేక్ బుడేసా అన్నారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. సత్తెనపల్లి బ్రాంచ్ ఏఐబీడీపీఏ సభ్యులు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఏసురత్నం, సభ్యులు పి.డానియల్, బి. నాగేశ్వరరావు, దశరథ, శ్రీహరి పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతి మహోత్సవం



గ్రామోత్సవంలో శ్రీ లక్ష్మీతిరుపతమ్మతల్లి

నకరికల్లు: స్థానిక శ్రీలక్ష్మీ తిరుపతమ్మ తల్లి జ్యోతి మహోత్సవం శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. అమ్మవారి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా జరిపించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై విశేష అలంకరణలో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. మాలధారులు అమ్మవారి కీర్తనలు ఆలపిస్తూ గ్రామోత్సవంలో పాల్గొన్నారు. మహిళా భక్తులు వార్లుపోసి మొక్కులు చెల్లించారు. ఆలయం వద్ద మహా అన్నదానం చేపట్టారు. అమ్మవారి కల్యాణ వేడుక శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ జిల్లా జాయింట్ సెక్రటరీగా రామకృష్ణానాయక్



రామకృష్ణానాయక్

అచ్చంపేట: పల్నాడు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ విభాగ కమిటీ సంయుక్త కార్యదర్శిగా తాడువాయి గ్రామానికి చెందిన మూడావతు రామకృష్ణా నాయక్ నియమితులయ్యారు. ఈ నెల 15న తాడేపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఆదేశాల మేరకు విడుదలైన జాబితాలో తనకు స్థానం లభించడం పూర్వజన్మ సుకృతమని ఆయన శుక్రవారం సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ జండా రెపరెపలాడే విధంగా ఎస్టీలను ఏకతాటిపైకి తెచ్చి అవిశ్రాంతంగా కృషిచేస్తానని చెప్పారు. ఇందుకు కారకులైన ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు కృతజ్ఞలు తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యులు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, మాదిపాడు ఎంపీటీసీ స్వర్ణమ్మ రమేష్ నాయక్, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి వేడుకలు

పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరులో వేంచేసియున్న అయోధ్య స్వామి ఆశ్రమంలో రథ సప్తమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం కాకడ హారతి, పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అలంకరణలు జరిగాయి. అయోధ్య స్వామి తపస్సుకు కూర్చున్న రోజు విశేషంగా జరిపారు. పురుషోత్తమపట్నం భక్తసమాజం 108 సార్లు సిద్ధమంగళ గోత్ర పారాయణం చేశారు. చిక్కుడు కాయలతో ఏకచక్ర రథం తయారు చేసి సూర్య భగవానునికి పూజలు నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. రామకృష్ణ, కోటేశ్వరమ్మ, స్వతంత్ర భారతీ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



పొంగళ్లు నివేదిస్తున్న భక్తులు

సూర్య భగవానుడికిప్రత్యేక పూజలు

సత్తెనపల్లి: పట్టణంలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉన్న షిర్డి సాయిబాబా దేవాలయంలో రథ సప్తమి సందర్భంగా సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్షుడు చల్లా రతయ్య, కమిటీ సభ్యులు, అర్చక స్వాములు, మహిళలు పాల్గొన్నారు.

వ్యాపారాల రిజిస్ట్రేషన్, లైసెన్సులు రెన్యువల్ చేసుకోవాలి

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ దుకాణ సంస్థల చట్టం ప్రకారం అన్ని వ్యాపార సంస్థల యజమానులు ఈ నెల 29లోపు కార్మిక శాఖలో రిజిస్ట్రేషన్, రెన్యువల్ లైసెన్సులు తీసుకోవాలని సత్తెనపల్లి సహాయ కార్మిక శాఖ అధికారి వి.అన్నపూర్ణ చెప్పారు. పట్టణంలోని తన కార్యాలయంలో శుక్రవారం వ్యాపార సంస్థల యజమానులతో ఆమె సమావేశం నిర్వహించారు. లైసెన్స్ పొందిన వారు తక్షణమే రెన్యువల్ చేసుకోవాలన్నారు. వ్యాపార సంస్థల యజమానులకు పలు సూచనలు చేశారు.

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలి

రాజుపాలెం: మండలంలోని నెమలిపురి, అనుపాలెం, కొండమోడు గ్రామాల్లోని 11 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సత్తెనపల్లి డీఎస్పీ డి.గురునాథబాబు, సీఐ ఎం.రాంబాబు శుక్రవారం పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా గట్టి చర్యలు తీసుకుంటామని, దీనికి తగ్గట్లుగా ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఎవరైన అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట ఎస్ఐ షమీర్‌బాషా, సిబ్బంది తదితరులు ఉన్నారు.



నెమలిపురి జెడ్పీ పాఠశాల పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న డీఎస్పీ

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై దృష్టి పెట్టాలి

ముప్పాళ్ళ: ఎన్నికల నేపథ్యంలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తహసీల్దారు పి.సింగారావు ఆదేశించారు. ముప్పాళ్ళ, చాగంటివారిపాలెం, గోళ్ళపాడు, కుందురువారిపాలెం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో ఉన్నటువంటి వసతులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. అవసరమైన చోట బారికేడ్లు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆర్.ఐ పవన్ కుమార్, వీఆర్వోలు అశోక్, దాసు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి

రాజుపాలెం: అనుపాలెం గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శుక్రవారం నిర్వమించారు. స్పెషలిస్టు డాక్టర్లు డాక్టర్ సుష్మ(జనరల్ సర్జన్), డాక్టర్ రవిశంకర్‌రెడ్డి(ఆర్థోపెడిక్), డాక్టర్ వెంకటకృష్ణకుమార్(జనరల్) 339 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్యులు సత్యనారాయణ 89 మందికి కంటి పరీక్షలు చేసి, కళ్లజోళ్లకు రిఫర్ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్లు జీవన్‌రావు, ఉషారాణి, మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్ దేవానాయక్, లక్ష్మీదుర్గ, ఏఎన్ఎంలు కమల, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అనుపాలెం రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సుష్మ

వలస కూలీలకు అనారోగ్యం

అచ్చంపేట: పెదపాలెంలో మిరప కోతలకు వచ్చిన వలస కూలీలు అతిసారా (నీళ్ల విరేచనాలు) వ్యాధితో బాధపడుతుండగా వైద్య సిబ్బంది సకాలంలో స్పందించి వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న నలుగురు పిల్లలు, ఇద్దరు పెద్దలను శుక్రవారం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు 108 అంబులెన్స్‌లో తరలించారు. మరొకరిని గుంటూరు జీజీహెచ్‌కి పంపారు. వీరంతా కార్ణాటకలోని రాయబరేలి జిల్లా అలి మండలం మాన్వి గ్రామానికి చెందినవారు. పెదపాలెంలోని ఓ రైతు పొలంలో మిర్చి కోతలు కోసేందుకు పది రోజుల క్రితం 21 కుటుంబాలు వచ్చాయి. పొలాల్లోనే గుడారులు వేసుకుని ఉంటున్న వీరు.. అక్కడే ఉన్న కుంటలు, కాల్వలు, బావుల్లో నిల్వ ఉన్న నీటిని తాగడంతో.. నీళ్ల విరేచనాలతో కూడిన వ్యాధిశోకి ఉండవచ్చని వైద్యులు భావిస్తున్నారు. డాక్టర్ ప్రవంతి స్పందిస్తూ.. కలుషిత ఆహారం వల్లనా.. లేక కలుషిత నీటిని తాగడం ద్వారా సమస్య వచ్చిందా అనే విషయం తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరి నుంచి బ్లడ్ శాంపిల్స్ సేకరించామన్నారు. స్థానికంగా లభ్యమయ్యే నీటి వనరుల నుంచి శాంపిల్స్ గుంటూరు రీజినల్ ల్యాబ్ సిబ్బంది సేకరించినట్లు చెప్పారు. వలస కూలీల నివాస స్థావరం వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేసి సహాయక చర్యలు చేపట్టామన్నారు. వీరిలో చరన్‌బసవ, ఎస్.యూసఫ్, తరున్, తేజా, మైసూర్ రాజా, రంగనాథ్‌లను సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించామన్నారు. మరోకరిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు పంపినట్లు చెప్పారు. వ్యాధి నిరోధక మాత్రలు ఇచ్చామని, సిబ్బందిని శిబిరం వద్దనే ఉంచి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నామన్నారు.



వైద్య శిబిరంలో వలస కూలీలకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రవంతి, పీహెచ్‌సీ సిబ్బంది

క్రికెట్ పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

సత్తెనపల్లి: రామకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 50 బాల్స్ క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒంగోలులోని శర్మ క్రీడా మైదానంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో అండర్ -17లో ప్రథమ స్థానం, అండర్-14లో ద్వితీయ స్థానం పల్నాడు జట్లు సాధించాయి. అండర్-14 లో ఎస్.సంతోష్‌నాయక్, కె. ప్రవీణ్, అండర్-17లో ఎం.ప్రవీణ్ జి.చైతన్య సభ్యులుగా ప్రతిభ కనబరిచారు. క్రీడాకారులను ప్రిన్సిపాల్ ఒ.జాన్సన్, పీఈటీ ఒ.రత్నాకర్ శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు.



క్రీడాకారులతో ప్రిన్సిపల్ జాన్సన్, పీఈటీ రత్నాకర్

ఘనంగా వసంతకుమారి జన్మదినోత్సవం

అచ్చంపేట: ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి జన్మదినోత్సవాన్ని స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణులు బర్త్‌డే కేక్ కట్ చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సాధించిన ప్రతి విజయంలోనూ ఆయన సతీమణి వసంతకుమారి ఉందనడంలో సందేహం లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా రజనీ కృష్ణా నాయక్, వైస్ ఎంపీపీ గంగసాని నరశింహారెడ్డి, సర్పంచ్ కంబాల వీరబాబు, మాజీ సర్పంచ్ టీవీఎస్ మల్లికార్జునరావు, ఉప సర్పంచ్ షేక్ జాని, మైనార్టీ నాయకులుప పాల్గొన్నారు.



వైభవోపేతంగా నగర సంకీర్తన

గురజాల : రథసప్తమిని పురస్కరించుకుని పట్టణంలో వేంచేసియున్న మహిమానిత్వ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి దేవాలయం ఆధ్వర్యంలో నగర సంకీర్తన వైభవోపేతంగా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం వద్ద నుంచి శివదీక్ష స్వాములు పార్వతి పరమేశ్వరుల చిత్ర పటంతో నగర సంకీర్తనలో పాల్గొన్నారు.

గణపవరం ఎస్సీ కాలనీలో వైద్య శిబిరం



రాజుపాలెం: గణపవరంలోని ఎస్సీ కాలనీలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి జ్వరాల సర్వే చేపట్టారు. మురుగు కాల్వల్లో ఎబెట్‌ను చల్లించారు. 38 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా ముగ్గురుకి జ్వరాలు ఉన్నట్లు గుర్తించారు. మలేరియా, డెంగీ పరీక్షలు చేశారు. సత్తెనపల్లి మలేరియా సబ్ యూనిట్ అధికారి చంద్రశేఖర్ ఇంటింటా తిరిగి నీరు నిల్వ ఉన్న తొట్టిలను గుర్తించి తొలగించారు. జ్వరాలు రాకుండా ముందస్తుగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సూపర్‌వైజర్ రాజేష్‌పాల్, పంచాయతీ కార్యదర్శి మహంకాళమ్మ, మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్ అలేఖ్య, ఏఎన్ఎంలు విమల, ధనలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.